# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-11-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అమరావతి రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి మండలి సమావేశం కొనసాగుతోంది.**

2. **వికసిత భారత్ లక్ష్య సాధన కోసం ఆంధ్రప్రదేశ్ ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.**

3. **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

4. **రాష్ట్రాన్ని మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు.**

5. **రాష్ట్రంలో 'మొంథా తుఫాను' ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందాలు ఈరోజు పర్యటిస్తున్నాయి.**

=========================

అమరావతి రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి మండలి సమావేశం ఈరోజు జరుగుతోంది. ఈ సమావేశంలో విశాఖపట్నంలో జరగనున్న భాగస్వామ్య సదస్సు, జిల్లాల పునర్వవస్థీకరణ, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు సహా పలు కీలక అంశాలపై చర్చిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 12వ రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్న లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులకు సంబంధించి సమావేశంలో చర్చించి, ఆమోదం తెలపనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. వీటితో పాటు భారత్ మహిళా క్రికెటర్ శ్రీ చరణికి ప్రభుత్వం ప్రకటించిన నగదుతో పాటు ఇంటి స్థలం, గ్రూప్ -1 ఉద్యోగం కేటాయింపు పైనా రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో ఆమోదం తెలపనున్నట్లు అధికారులు తెలిపారు.

-------------------------

వికసిత భారత్ లక్ష్య సాధన కోసం ఆంధ్రప్రదేశ్ ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుంటూరులో వాటర్ షెడ్ జాతీయ సదస్సులను ఆయన ఈరోజు ప్రారంభించారు. భారతదేశం నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమైన పాత్ర పోషించడానికి వాటర్ షెడ్ జాతీయ సదస్సు వంటి కార్యక్రమాలు దోహదపడతాయని కేంద్రమంత్రి పెమ్మసాని

చంద్ర శేఖర్ పేర్కొంటూ..

వాయిస్...35 సెకన్లు

---------------------------

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా, యలమంచిలి మండలం, కలగంపూడి గ్రామంలో 50 లక్షల రూపాయలతో జల్ జీవన్ మిషన్ పనులను మంత్రి ఈరోజు ప్రారంభించారు. రాష్ట్రంలో జల జీవన్ మిషన్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2027 వరకు పొడిగించినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు వివరిస్తూ..

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ఆదేశాలకు అనుగుణంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ, సర్వే శాఖలు సంయుక్తంగా ఈరోజు నుంచి ఈ నెల 22వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామ కంఠాల్లో ఇళ్లు, స్థలాలకు ప్రాపర్టీ కార్డులు జారీ చేసే ముందు ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. స్వామిత్వ పథకంలో భాగంగా రెండో విడత కింద 45 లక్షల ఆస్తులకు కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

---------------------------

రాష్ట్రంలో 'మొంథా తుఫాను' ప్రభావిత జిల్లాల్లో కేంద్ర బృందాలు ఈరోజు పర్యటిస్తున్నాయి. బాపట్ల జిల్లాలో ఒక బృందం, కృష్ణా, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో మరొక బృందం పర్యటించి తుఫాను కారణంగా జరిగిన పంట, ఆస్తి నష్టాన్ని అంచనా వేస్తుంది. ఈ పర్యటన పూర్తయిన అనంతరం రేపు సాయంత్రం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ఈ బృందాలు సమావేశం కానున్నాయి.

---------------------------

రాష్ట్రాన్ని మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. విశాఖపట్నంలో Andhra Pradesh MSME Development Corporation ఎక్స్ పోర్ట్ సమ్మిట్ ను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వ్యాపారాలను అంతర్జాతీయ స్థాయికి విస్తరించాలనుకునే అన్ని MSME సంస్థలకు ఆంధ్రప్రదేశ్ MSME ఎక్స్ పోర్ట్ సమ్మిట్ -2025 ప్రత్యేక వేదికగా నిలుస్తుందని చెప్పారు. ఐటీ రంగంలో విశాఖపట్నం వేగంగా అభివృద్ధి చెందుతోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొంటూ...

వాయిస్ 30 సెకన్లు

---------------------------

భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా రేపు మైనార్టీ సంక్షేమ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో ఈ అంశంపై ఆయన నిన్న చర్చించారు.

రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ భాషాభివృద్ధికి విశేష కృషి చేసిన వారికి పురస్కారాలను అందజేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.

--------------------------

వన్ ధన్ వికాస్ కేంద్రాల ద్వారా గిరిజన మహిళల ఆర్థికాభివృద్ధి, జీవన ప్రమాణాల మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ తెలిపారు. పాడేరు సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ–ఐటిడిఎ కాఫీ హౌస్‌లో బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక సమావేశం ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీన బిర్సా ముండా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

--------------------------

ప్రభుత్వ సెకండరీ ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల కొరత తీర్చేలా 227 మంది పిజి పూర్తి చేసిన వైద్యులు విధుల్లో చేరనున్నారని వైద్యారోగ్యశాఖ వెల్లడించింది. ఇన్ సర్వీస్ అభ్యర్థులుగా 12 సబ్జెక్టుల్లో పిజి పూర్తి చేసిన 227 మంది వైద్య నిపుణులను 142 సెకండరీ ఆస్పత్రులకు కేటాయించినట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. 100 పిహెచ్‌సిల్లో 155 మంది స్పెషలిస్ట్ వైద్యులు త్వరలో విధుల్లో చేరనున్నారని, 33 ఏరియా ఆస్పత్రుల్లో 60 మంది, 7 జిల్లా ఆస్పత్రుల్లో 10 మంది, 2 ఎంసిహెచ్ ఆస్పత్రుల్లో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులకు కౌన్సెలింగ్ విధానంలో పోస్టింగ్ ఇచ్చినట్లు తెలిపింది

--------------------------

ఆంధ్రప్రదేశ్ యానాం, దిగువ ట్రోపో ఆవరణంలో ఉత్తర ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా రాష్ట్రంలో ఈరోజు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకట్రావు పేర్కొంటూ..

వాయిస్ 18 సెకన్లు

--------------------------

తెలుగు సాహిత్యానికి విశిష్ఠ సేవలు అందించిన ఆంగ్లేయుడు, తొలి తెలుగు శబ్దకోశాన్ని ప్రచురించిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతి ఈరోజు. 1798 నవంబర్ 10వ తేదీన కోల్‌కతాలో జన్మించారు. తెలుగుజాతికి సేవ చేసిన నలుగురు ప్రముఖ బ్రిటిషు అధికారులలో బ్రౌన్ ఒకరు. ఆంధ్ర భాషోద్ధారకుడు అని గౌరవించబడిన వ్యక్తి కూడా. తండ్రి మరణించిన తరువాత కుటుంబంతో ఇంగ్లాండ్ వెళ్లిపోయిన బ్రౌను అక్కడే హిందూస్థానీ భాష నేర్చుకున్నారు. 1817 ఆగష్టు 4న మద్రాసులో ఈస్ట్ ఇండియా కంపెనీలో ఉద్యోగంలో చేరిన ఆయన ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా మద్రాసులో కోదండరామ పంతులు వద్ద తెలుగు భాషను అభ్యసించారు.

=====================